క్లుప్తంగా...

నేడు మంత్రి మల్లారెడ్డి పర్యటన

మేడ్చల్: మండలంలోని వివిధ గ్రామాల్లో, మేడ్చల్ పట్టణంలోమంత్రి మల్లారెడ్డి నేడు పర్యటించి అభివృద్ధి కార్యక్రమాలకు, శంకుస్థాపనలు చేస్తారని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు దయానంద్ యాదవ్, మున్సిపల్ చైర్ పర్సన్ దీపికానర్సింహారెడ్డి తెలిపారు. పట్టణంలోని 10, 17, 21, వార్డులలో, మండలంలోని మైసిరెడ్డిపల్లి, లింగాపూర్, డబీల్‌పూర్, నూతన్‌కల్ కోనాయిపల్లి గ్రామాల్లో మంత్రి పర్యటిస్తారని తెలిపారు. అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు, వార్డుల కౌన్సిలర్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యక్రమాల్లో పాల్గొనాలని నాయకులు కోరారు.

దరఖాస్తుల స్వీకరణ


దరఖాస్తులు స్వీకరిస్తున్న శోభారాణి, ప్రవీణ్‌రావు

ఘట్‌కేసర్: కాచవానిసింగారంలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం రెండు పడకల ఇళ్ల దరఖాస్తులు స్వీకరించారు. ముఖ్య అతిథులుగా బీజేపీ మండల అధ్యక్షుడు చలువాదీ ప్రవీణ్‌రావు, ఎంపీటీసీ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కొమ్మిడి శోభారాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెండు పడకల ఇళ్లకు కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద నిధులు కేటాయిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభంజన్, బస్వరాజ్, దామోదర్‌రెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

మైక్రోసాఫ్ట్ టెక్నాలజీపై సదస్సు



ఘట్‌కేసర్: వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో ఆర్టిఫిషల్ ఇంటలీజెన్స్(ఏఐ) డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఆదివారం 'మైక్రోసాఫ్ట్ టెక్నాలజీ'పై మూడు రోజుల స్టూడెంట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా మైక్రోసాఫ్ట్ ప్రతినిధి ఆదిత్య, ఏఐ హెచ్‌ఓడీ మల్లికార్జున్ హాజరై ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ప్రయోజనాలు, మైక్రోసాఫ్ట్ టెక్నాలజీపై వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ శ్రీధర్‌రెడ్డి, చైతన్య, వంశీకృష్ణ, ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మేడ్చల్‌రూరల్: ఎల్లంపేట్ గ్రామంలోని సీసీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. ఇటీవల గ్రామ పర్యటన చేసిన మంత్రి మల్లారెడ్డి తన సొంత నిధులతో సీసీ రోడ్లు ఏర్పాటు చేస్తానని హామీ ఇవ్వగా ఈ మేరకు పనులు చేపట్టారు. ఆదివారం రోడ్ల పనులను నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి, మంత్రి తనయుడు మహేందర్ రెడ్డి గ్రామ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వెన్నెల రామకృష్ణుడు, ఎంపీటీసీ కుమార్‌యాదవ్, ఉపసర్పంచ్ గోప గణేశ్ మంత్రి మల్లారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. మండల బీఆర్ఎస్ నాయకులు రాజమల్లారెడ్డి, భాగ్యారెడ్డి, వార్డు సభ్యులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

పంచలోహాల విగ్రహాల సమర్పణ


విగ్రహాలను అందజేస్తున్న రాములు

మేడ్చల్: పట్టణ పరిధిలోని 4వ వార్డు కిష్టాపూర్ నల్ల పోచమ్మ ఆలయానికి మండలంలోని పూడూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు గాదరి రాములు పంచలోహాల విగ్రహాలను సమర్పించారు.ఆలయ కమిటీ వారు రాములును విగ్రహాల కోసం కోరగా ఆయన ఆదివారం అమ్మవారి ఆలయంలో కమిటీ సభ్యులకు విగ్రహాలను అందజేసి పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ తుడుం గణేష్, నాయకులు యాదయ్య, కృష్ణ, బాలయ్య నరేందర్ పాల్గొన్నారు.

కార్మికులకు అండగా ఉంటా

మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: అసంఘటిత రంగ కార్మికులకు అండగా ఉంటామని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. ఆదివారం భారతీయ మజ్దూరు సంఘ్ (బీఎంఎస్) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆనంద్‌బాగ్‌లో డీసీఎం డ్రైవర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... కార్మికులకు అండగా బీఎంఎస్ ఎల్లప్పుడూ ఉంటుందని, వారి సమస్యలను పరిష్కరించి అందుబాటులో ఉంటామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు రవిశంకర్, నేతలు యాదగిరి, సురేందర్, అంజయ్య, సుధాకర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు

రూ.లక్ష ఆర్థిక సాయం @ 22,077 దరఖాస్తులు

ఈనెల 25 వరకు అర్హులైన లబ్ధిదారులకు రూ.లక్ష ఆర్థిక సాయంపై చర్యలు

- నియోజకవర్గానికి 300 మంది ఎంపికపై కసరత్తు
- జిల్లాలో దరఖాస్తులు 22,077 రావటంతో.. ఎంపికపై అయోమయం
- మేడ్చల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి నియోజకవర్గాల్లో 150 మంది లబ్ధిదారులకు రూ.లక్ష ఆర్థిక సాయం



సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన బీసీ చేతివృత్తిదారులకు రూ.లక్ష ఆర్థిక సాయం లబ్ధిదారుల ఎంపిక కొనసాగుతోంది. ఈనెల 25వ తేదీ వరకు అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక సాయం చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక్కో నియోజకవర్గంలో 300 మందికి తొలివిడతలో సాయం అందజేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు. ప్రభుత్వం విడుదల చేసే నిధుల ఆధారంగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తిచేసేందుకు జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

తొలి జాబితాపై..

దరఖాస్తులు వెల్లువెత్తిన నేపథ్యంలో లబ్ధిదారుల ఎంపిక అధికార యంత్రాంగానికి తలనొప్పి తెచ్చిపెడుతోంది. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎంపీడీఓలు, పురపాలక సంఘాల కమిషనర్లు/క్షేత్రస్థాయిలో దరఖాస్తుల పరిశీలన పూర్తిచేసి ప్రభుత్వానికి నివేదించారు. సీజీజీ (సెంటర్ ఆఫ్ గుడ్ గవర్నెన్స్) 298 డిగ్రీల ప్రకారం ఆధార్ అనుసంధానం ఆధారంగా లబ్ధిదారులను గుర్తించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో రూ.లక్ష ఆర్థిక సాయం కోసం 22,077 మంది దరఖాస్తులు చేసుకోగా, 1500 మంది దరఖాస్తుదారులను మాత్రమే మొదటి విడతలో అర్హులుగా తేల్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా ఈనెల 15న కలెక్టరేట్‌లో మేడ్చల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి అర్హులైన 150 మంది లబ్ధిదారులకు రూ.లక్ష ఆర్థిక సాయాన్ని జిల్లా మంత్రి మల్లారెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. మిగతా ఉప్పల్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాలకు సంబంధించి 100 మంది లబ్ధిదారులను గుర్తించినప్పటికీ నిధులు లేని కారణంగా పంపిణీ చేయలేకపోయినట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నారు. అలాగే ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పెండింగ్‌లో ఉన్న 1350 మంది లబ్ధిదారుల ఎంపిక.. రూ.లక్ష పంపిణీపై సంబంధిత అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

హడావుడిగా పరిశీలన..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో చేపట్టిన దరఖాస్తుల పరిశీలన తీరుపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఎంపిక చేసిన దరఖాస్తుల్లోని అర్హులకు కూడా ప్రాధాన్య క్రమంలో రూ.లక్ష ఆర్థిక సాయం చేయనున్నట్లు సమాచారం. మొదటగా ప్రభుత్వం నుంచి మంజూరయ్యే నిధుల ఆధారంగా డివిజన్లు/వార్డులు, మండలాల ప్రాతిపదికన తీసుకుని లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తిచేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

> **మార్గదర్శకాలకు అనుగుణంగా ఎంపిక..**
>
> ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రూ.లక్ష ఆర్థిక సాయం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను చేపడుతున్నాం. దరఖాస్తులను ఎంపీడీఓలు, కమిషనర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి స్క్రూటినీ చేశారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన దరఖాస్తులను ప్రభుత్వానికి నివేదించాం. కలెక్టర్ నేతృత్వంలోని కమిటీ ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరుగుతోంది. – కేశూరామ్, బీసీ అభివృద్ధి శాఖ అధికారి, మేడ్చల్ జిల్లా

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం


చెక్కును అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్: గౌడవెల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారుడికి సీఎం సహాయకనిధి నుంచి మంజూరైన ఆర్థిక సాయం చెక్కును మంత్రి మల్లారెడ్డి గౌడవెల్లి నాయకులతో కలిసి తన నివాసంలో ఆదివారం అందజేశారు. గౌడవెల్లికి చెందిన వెంకటేష్‌కు లక్షా 25వేల ఆర్థిక సాయం వైద్యం కోసం మంజూరు కావడంతో చెక్కును మంత్రి మల్లారెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జగన్‌రెడ్డి నాయకులు దయానంద్‌యాదవ్, రాజగోపాల్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, యుగపతి, సింహల్, విగ్నేష్ పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న కౌన్సిలర్ దేవ రాజు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లికి చెందిన లబ్ధిదారుడికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన ఆర్థిక సాయం చెక్కును నాయకులతో కలిసి 3వ వార్డు కౌన్సిలర్ జాకట దేవరాజు లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి ఆదివారం అందజేశారు. అత్వెల్లికి చెందిన చంద్రమ్మకు రూ.60 వేల ఆర్థిక సాయం వైద్యం కోసం మంజూరు కావడంతో చెక్కును అందజేశారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ఘట్‌కేసర్: వెంకటాపూర్ నీలిమా ఆస్పత్రి ఆధ్వర్యంలో చౌదరిగూడ విజయపురి కాలనీలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సర్పంచ్ రమాదేవి ముఖ్యఅతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో 470 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ నీలిమా మాట్లాడుతూ.. వెంకటాపూర్ నీలిమా ఆస్పత్రిలో ప్రతినెలా 9న నీలిమా 9 పేరుతో గర్భిణిలకు వైద్య పరీక్షలు, స్కానింగ్‌తో పాటు ఇతర పరీక్షలు ఉచితంగా అందజేస్తామన్నారు. సాధారణ ప్రసవం అయితే ఫీజు తీసుకోకుండా ఉచితంగా సేవలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఫిజిషియన్ శ్రీకాంత్, ఎముకల నిపుణులు సురేందర్, హరీశ్, సిబ్బంది భరత్‌రెడ్డి పాల్గొన్నారు.

నాగారంలో ఉచిత వైద్య శిబిరం

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు విష్ణుపురి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ట్రినిటి ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. వైద్య శిబిరంలో కాలనీ వాసులకు ఉచితంగా వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అనితాసుధాకర్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు జగదీష్, కార్యవర్గ సభ్యులు కృష్ణమాచార్యులు, పైల్ల మల్లారెడ్డి, కాకళ్ల శ్రీనివాస్, అశోక్, వెంకటాచారి, రాజేష్ పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేస్తున్న నీలిమా ఆస్పత్రి వైద్య సిబ్బంది



నాగారంలో 9వ వార్డులో ఉచిత వైద్య శిబిరం

వర్షాకాలంలో విరివిగా మొక్కలు నాటాలి


మొక్కలు నాటుతున్న కౌన్సిలర్ హరిప్రసాదరావు

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో కౌన్సిలర్ బెజ్జంకి హరిప్రసాదరావు ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరిప్రసాదరావు మాట్లాడుతూ.. వర్షాలు పడుతున్న సమయంలో మొక్కలు నాటితే ఏపుగా పెరుతాయన్నారు. నిర్వహణ భారం తక్కువగా ఉంటుందన్నారు. అందుకే వర్షాకాలంలో విరివిగా మొక్కలు నాటాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పచ్చదనం పెంపొందించడంలో కాలనీవాసులు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్కృతి టౌన్‌షిప్ ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

విద్యార్థులు మాతృభాషపై పట్టు సాధించాలి


ఆన్‌లైన్ ద్వారా సాహిత్య సప్తాహ కార్యక్రమం

మల్కాజిగిరి: విద్యార్థులకు మాతృభాషపై పట్టు సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏపీ ప్రభుత్వ నంది అవార్డు గ్రహీత , సినీ గేయ రచయిత సాధనాల వెంకటస్వామి నాయుడు అన్నారు. ఆదివారం అక్షర కౌముది సాహిత సామాజిక సేవా సంస్థ నాల్గవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని దాశరథి, సినారె జయంతి సందర్భంగా సాహిత్య సప్తాహ కార్యక్రమాన్ని ఆయన ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి నాయుడు మాట్లాడుతూ... ఇప్పుడిప్పుడే ప్రభుత్వాలు కూడా అనేక పాఠశాలల్లో విద్యాబోధన మాతృభాషలో ఉండేలా చర్యలు తీసుకోవడం హర్షణీయమన్నారు. విద్యార్థులకు కూడా భాషపై పట్టు ఉండాలంటే ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడుతాయన్నారు. నిర్వాహకులు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో భీంపల్లి శ్రీకాంత్, సీత లక్ష్మి, తిరుపతిరెడ్డి, శ్రీదేవి, వెంకటకృష్ణ, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో మేడ్చల్ విద్యార్థుల ప్రతిభ


బంగారు పతకం అందుకుంటున్న హర్షితారెడ్డి

మేడ్చల్: చింతల్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే ఓపెన్ చాంపియన్ షిప్‌లో మేడ్చల్‌కు చెందిన యూనివర్సల్ 369 అకాడమీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అండర్–10 విభాగంలో మేడ్చల్‌కు చెందిన విద్యార్థి హర్షితారెడ్డి బంగారు పతకం సాధించింది. మనీష్, మనోజ్ఞ, వరప్రసాద్, నిత్విక్ బంగారు పతకాలు, రిషి, భానుప్రసాద్, ప్రీతం, తదితరులు మెడల్స్ అందుకున్నారు.

సొంత డబ్బులతో అభివృద్ధి పనులు



కీసర: రాంపల్లిదాయర గ్రామ పంచాయతీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఇంటింటికీ నల్లా ద్వారా తాగునీటిని అందించేందుకు ప్రజల విజ్ఞప్తి మేరకు గ్రామ పంచాయతీ 1వ వార్డు సభ్యుడు కందాడి శ్రీకాంత్‌రెడ్డి సుమారు రూ.2.5లక్షల సొంత నిధులతో తాగునీటి పైప్‌లైన్ పనులను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వార్డు సభ్యుడు శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామ పరిధిలోని వివిధ కాలనీల్లో ప్రజల సమస్యలను తెలుసుకొని తన సొంత డబ్బులను వెచ్చించి వివిధ అభివృద్ధి పనులను చేపట్టానన్నారు. ఇకపై కూడా ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు తాను ముందుంటానన్నారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి


సూరజ్ (ఫైల్)

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్‌లో శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందాడు. సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ పట్టణం శివారెడ్డిగూడ మారుతీనగర్‌కు చెందిన కందూరి సూరజ్ (26) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఈడబ్ల్యూఎస్ కాలనీలో ఉండే స్నేహితులు వంశీకృష్ణ, ప్రవీణ్‌కు కారును అప్పగించడానికి వెళ్లాడు. అర్ధరాత్రి బెలినో కారు అప్పగించి స్నేహితుడి బైక్‌పై ఇంటికి తిరిగి వస్తుండగా మాధవరెడ్డి రైల్వే వంతెన వద్ద అర్ధరాత్రి 12.40 గంటలకు బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడి అక్కడికక్కడే మరణించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడిపల్లి: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా మేడిపల్లిలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. మేడిపల్లి ప్రధాన రహదారి శ్రీసాయి హాస్పిటల్ నుంచి అపెక్స్ మెయిన్ రోడ్డు, 11కేవీ మేడిపల్లి పీడర్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు. వినాయక్ నగర్ ఓం విహార్ కాలనీ, భరత్‌పురి కాలనీ, మారుతి నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని వివరించారు.

వైభవంగా బోనాల వేడుకలు

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ పట్టణంలో బోనాల పండగను ఆదివారం వైభవంగా నిర్వహించారు. బోనాలను వేప ఆకులు, పసుపు కుంకుమతో అందగా అలంకరించి ఊరేగింపుగా అమ్మవారి ఆలయాలకు చేరుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి అమ్మ వారికి బోనాలు, నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మంత్రి మల్లారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ పావనీయాదవ్, వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్లతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, జంగయ్యయాదవ్, ఎఫ్ఎస్‌సీఎస్ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్లు శశికళ, ఆంజనేయులుగౌడ్, నర్సింగ్‌రావు, మాజీ జెడ్పీటీసీ సంజీవరెడ్డి, మాజీ ఎంపీటీసీ నర్సింగ్‌రావు, రాధాకృష్ణ ముదిరాజ్, దేవేందర్ ముదిరాజ్, ఆంజనేయులు ముదిరాజ్ పాల్గొన్నారు.


పెద్దమ్మ తల్లికి బోనం సమర్పిస్తున్న కౌన్సిలర్ శశికళదేవేందర్

నారపల్లిలో..

పోచారం: నారపల్లిలో ఆదివారం నిర్వహించిన బోనాల వేడుకల్లో మంత్రి మల్లారెడ్డి పాల్గొన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి మల్లారెడ్డి, చైర్ పర్సన్ పావనీయాదవ్, వైస్ చైర్మన్ మాధవరెడ్డి

ఆలయ నిర్మాణానికి విరాళం

పోచారం: పోచారంలో నిర్మిస్తున్న మహంకాళమ్మ, ఈదమ్మ, పోచమ్మ, మైసమ్మ ఆలయానికి రూ.5 లక్షల విరాళంతో పాటు శివాలయంలో దత్తాత్రేయ స్వామి విగ్రహ ఏర్పాటుకు రూ.1.50 లక్షల నగదును సామల యాదిరెడ్డి (ఎస్‌వైఆర్) ఫౌండేషన్ ఆదివారం అందజేసింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ సామల యాదిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సామల సందీప్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలకు ఫౌండేషన్ సహకారం తప్పక ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వైఆర్ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ రెడ్డి, కార్యదర్శి రాజిరెడ్డి, సభ్యులు బుచ్చిరెడ్డి, కొండల్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


విరాళం అందజేస్తున్న ఎస్‌వైఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు

భక్తిశ్రద్ధలతో గంగమ్మకు పూజలు



మేడ్చల్: మూడు రోజుల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో చెరువులు నిండటంతో నాయకులు గంగమ్మతల్లికి ప్రజలతో కలిసి పూజలు చేశారు. మేడ్చల్‌తో పాటు మండలంలోని గ్రామాల్లో కురిసిన వర్షాలకు చెరువులు సమృద్ధిగా నీటితో నిండి అలుగులు పారుతుండటంతో గ్రామాల్లో, పట్టణంలో నాయకులు ప్రజలతో కులవృత్తుల వారితో కలిసి ఆదివారం పూజలు చేశారు. మేడ్చల్ పట్టణంలో బొడ్రాయి నుంచి పెద్ద చెరువు వరకు పూజా సామగ్రితో ర్యాలీగా వెళ్లి చెరువులో గంగమ్మ తల్లికి పూజలు చేసి మేకను నీటిలో వదిలారు. మున్సిపల్ చైర్ పర్సన్ దీపికానర్సింహారెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

సందడిగా సీఎంఆర్ఐటీ గ్రాడ్యుయేషన్ డే



మేడ్చల్ రూరల్: విద్యార్థులు డిగ్రీ పట్టా అందుకోవడం జీవితంలో ఒక మైలు రాయి దాటడం వంటిదని జేఎన్‌టీయూహెచ్ రెక్టార్ గోవర్ధన్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ఐటీ కళాశాల గ్రాడ్యుయేషన్ డే ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ వ్యక్తి జీవితంలో కొన్ని టర్నింగ్ పాయింట్స్ ఉంటాయని, బీటెక్ పట్టా అందుకోవడం కూడా జీవితంలో ఒక టర్నింగ్ పాయింట్ లాంటిదన్నారు. జీవితంలో సక్సెస్ అవ్వాలంటే హార్డ్‌వర్క్, స్మార్ట్‌వర్క్, నెట్వర్క్ మూడింటిని పాటించాలని సీఎంఆర్ గ్రూప్స్ కార్యదర్శి గోపాల్ రెడ్డి అన్నారు. అనంతరం కళాశాల డైరెక్టర్ జంగారెడ్డితో కలిసి విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. ఉత్తమ విద్యార్థులను మెడల్స్‌తో అభినందించారు. ఈ కార్యక్రమంలో యాజమాన్య సభ్యులు భూపాల్‌రెడ్డి, శ్రీశైలంరెడ్డి, అభినవ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



కీసరలో అంబేద్కర్‌కు జ్ఞానమాల సమర్పణ కార్యక్రమంలో భద్రారెడ్డి తదితరులు

కీసర: అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మల్లారెడ్డి హెల్త్ యూనివర్సిటీ చైర్మన్ డాక్టర్ భద్రారెడ్డి అన్నారు. ఆదివారం కీసరలో అంబేడ్కర్‌కు 77వ వార్డు జ్ఞానమాల సర్పరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మాట్లాడుతూ.. నేడు మన సమాజంలో అనుభవిస్తున్న వివిధ పదవులు ఆయన చలువనేనన్నారు. ముమ్ముందు ఆయన చూపిన బాటలో నడిచి అందరికీ ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బెస్త వెంకటేష్, ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ, వైస్ ఎంపీపీ సత్తిరెడ్డి, సర్పంచులు మాధురి వెంకటేష్, పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు నారాయణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, అంబేడ్కర్ సంఘం మండల అధ్యక్షుడు రవీందర్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

ఘట్‌కేసర్: అంబేడ్కర్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని ప్రతాపసింగారం ఎస్ఎంసీ చైర్మన్ బద్దం కుమార్ అన్నారు. ప్రభుద్ధ భారత్ ఇంటర్నేషనల్ మేడ్చల్ నియోజకవర్గ బాధ్యుడు అరుణ్‌కుమార్ అధ్యక్షతన ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ 18 డిగ్రీలు అభ్యసించి ప్రపంచంలో మేధావిగా ఖ్యాతికెక్కాడన్నారు. ఈ కార్యక్రమంలో దాస్, శ్రీనివాస్, రాజేశ్‌కుమార్, నవీన్, హరిప్రసాద్, వెంకటేశ్వర్‌రావు, అంజయ్య, రూపేశ్, గణేశ్, అనుశ్, ఉపేందర్, విష్ణు, కార్తీక్ పాల్గొన్నారు.

ప్రీకాస్టెడ్ విధానంలో ఆర్‌యూబీని నిర్మించాలి

మల్కాజిగిరి: వాజ్‌పేయినగర్ రైల్వే లెవెల్ క్రాసింగ్ వద్ద ప్రీ కాస్టెడ్ బాక్స్‌లతో ఆర్‌యూబీ నిర్మాణాన్ని చేపట్టాలని సబర్బన్ బస్ అండ్ ట్రైన్ ట్రావెలర్స్ అసోషియేషన్ కార్యదర్శి నూర్ కోరారు. ఆ మార్గంలో ప్రస్తుతం గూడ్స్ రైళ్లు ప్రయాణిస్తున్నాయని, భవిష్యత్తులో ఎంఎంటీఎస్ రైళ్లు ప్రయాణిస్తే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందన్నారు. ఇప్పుడే రైల్వే గేటు వేసినపుడు ఎక్కువ సమయం వేచి చూడాల్సి వస్తుండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ముఖ్యంగా అంబులెన్స్‌లు కూడా ఆగిపోయే పరిస్థితి ప్రస్తుతం ఉందన్నారు. ప్రీ కాస్టెడ్ బాక్స్‌లతో నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయవచ్చునన్నారు.